



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇసుక లేదు.. పని లేదు...

- దయనీయంగా భవన నిర్మాణ కార్మికుల బతుకులు
- పట్టించుకోని ప్రభుత్వం, పాలకులు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక లేకుండా పోయింది. దీంతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడి పని చేసే కార్మికులకు పని లేకుండా పోయింది. కార్మికుల బతుకులు దయనీయంగా మారిపోయాయి. ప్రభుత్వం, పాలకులు భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోకపోవడంతో పూట గడవడం కష్టంగా మారింది...



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. నిర్మాణ రంగంలో దాదాపు 36 రకాల పనులు చేసేవారున్నారు. బోర్లు తీసేవారు, రాడ్ బెండింగ్, తాపీ పని, సెంట్రింగ్, ప్లంబింగ్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్లు, మార్బుల్స్ అతికేవారు, ఇటుక బట్టీల్లో పని చేసేవారు, కాంక్రీట్ మిల్లర్లు, భవన నిర్మాణ కార్మికులు ఇలా వీరందరూ నిర్మాణ రంగంపై ఆధారపడి బతుకుతున్నారు. వీరంతా రోజువారీ పనులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తుంటారు. తాపీ మేస్త్రీకి రూ.900 నుంచి రూ.వెయ్యి, పని చేసే కార్మికులకు రూ.500 నుంచి రూ.600 వరకూ కూలి ఉంటుంది. నెలంతా పని చేస్తేనే వీరికి ఇల్లు గడుస్తోంది. ఇసుక సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడంతో గడిచిన మూడు నెలలుగా నిర్మాణ రంగం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పనుల్లేక కార్మికులు రోడ్డున పడిన పరిస్థితి ఉంది. ఆదాయం లేకపోవడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబాలు అద్దె చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు కొనసాగుతున్నా ధరలు చూస్తే గుండె గుబేలుమంటోంది. మూడు నెలల క్రితం వరకూ పది చక్రాల లారీ ఇసుక రూ.18 వేల నుంచి రూ.20 వేలు వరకూ ఉండేది. ఇప్పుడు రూ.30 వేల నుంచి రూ.32 వేల వరకూ ధర పలుకుతోంది. మొన్నటి వరకూ టన్ను ఇసుక రూ.వెయ్యి ఉండగా ప్రస్తుతం రూ.1500 వరకూ పలుకుతోంది. ట్రాక్టర్ ఇసుక రూ.1200 ఉండేది కాస్తా రూ.ఐదు వేలకు చేరింది. బ్లాక్‌మార్కెట్లో ఇసుక కొనుగోలు చేయాలంటే చుక్కలు కన్పిస్తున్నాయి. నిర్మాణ రంగం పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

వైసిపి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఉచిత ఇసుక పాలసీని రద్దు చేసి కొత్త పాలసీ ప్రకటించడంలోనూ జాప్యం చేయడంతో భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులు నెలల తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దఎత్తున ఉపాధి పొందే రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణ కార్మికుల పట్ల ప్రభుత్వం అత్యంత ఘోరంగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. లక్షల కుటుంబాలు ఉపాధి లేక అల్లాడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకుండా పోయింది. పిల్లలకు ఫీజులు కట్టలేక, ఇల్లు గడవక అప్పులు తెచ్చి కార్మికుల కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయి. ఇసుక సరఫరాలో ప్రభుత్వం ఆది నుంచి వివాదస్పదంగానే వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా ఉపాధి కల్పించకపోగా ఉన్న ఉపాధిని సైతం ప్రభుత్వం దెబ్బతీస్తుందనే చర్చ కార్మికుల్లో నడుస్తోంది. ప్రభుత్వం వెంటనే ఇసుక సరఫరాను వేగవంతం చేసి నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులను ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.

పని కల్పించేలా చర్యలు తీసుకోవాలి



ఇసుక నిలిచిపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండా పోయింది. ఇసుకను ప్రభుత్వం సరఫరా చేయాలి. భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలి. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి. సిమెంట్, స్టీల్ ధరలను తగ్గించాలి. అర్హులైన భవన నిర్మాణ కార్మికులందరికీ వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛను ఇవ్వాలి. ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ బోర్డు నిధులను వెంటనే జమ చేయాలి. కార్మికుని సొంత ఇంటి నిర్మాణానికి రుణాలు ఇవ్వాలి. కార్మికుల కోసం ఇప్పటికే పలు ఆందోళనలు చేపట్టాం. ఆందోళనలు మరింత తీవ్రం చేస్తాం.

- కె.సుధాకరప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్.

కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తాం

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలును కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టకపోతే కలెక్టరేట్‌ను దిగ్బంధం చేస్తామని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం కర్నూలు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ఇది రైతుల ప్రభుత్వం, రైతుల సంక్షేమ గురించి చెప్పడం తప్ప రైతులను ఆదుకోవాలనే తపన లేదన్నారు. వర్షాలులేక రబీ ఖరీఫ్‌లో రైతులు వేసుకున్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు చేసిన ఉద్యమాల ఫలితంగా కరువు మండలాలుగా ప్రకటించాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఉన్నతాధికారులు 400 పైగా కరువు మండలాలు ఉన్నాయని గుర్తిస్తే, ప్రభుత్వం మాత్రం 103 మండలాలను మాత్రమే ప్రకటించడం చూస్తే రైతులపై ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. కర్నూలు మండలంలో 27వేల ఎకరాల్లో రైతులు సాగు చేసుకున్నారని, కెసికెనాల్ ద్వారా తుంగభద్ర నది ద్వారా కొంతమెర నీరు అందుతుందని, వర్షం బాగా వచ్చి పంటలు బాగా పండుతాయని, ఆశించిన రైతులు, వర్షాలు లేక కెసి కెనాల్ ద్వారా నీళ్ల రాక పంటలు మొత్తం నాశనం అయిపోతే, ప్రభుత్వ అధికారులు మాత్రం సాధారణ వర్షపాతం నమోదైనట్టు, రైతులు బాగున్నట్టు రిపోర్టు పంపడం రైతులను గొంతు కోయడం తప్ప మరొకటి కాదన్నారు. నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే రైతులను ఆదుకోవాలనె తపన ప్రభుత్వానికి ఉంటే కర్నూలు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టి ప్రతి ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతాంగాన్ని కలుపుకొని కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనతరం తహశీల్దార్‌కు వినతీ పత్రం అందచేశారు. సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు నగేష్, పంచలింగాల మాజీ సర్పంచి వెంకటేశ్వర్లు, ఈ తాండ్రపాడు సర్పంచి బాలపీర, సిపిఎం మండల నాయకులు రాఘవేంద్ర, అబ్దుల్లా గొందిపర్ల నాయకులు శ్రీనివాసరెడ్డి, శివ,వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఇప్పటి నుండే సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ డాక్టర్ జి.సృజన నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల నోడల్ అధికారులతో డాక్టర్ జి.సృజన ఇంట్రొడక్టరీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు 6 నెలల కంటే తక్కువ సమయం ఉందన్నారు. . జిల్లాలో ప్రస్తుతం 2186 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఈ సంఖ్య కొంత పెరిగే అవకాశం ఉన్నందున 2200 పోలింగ్ స్టేషన్‌కు ఆరుగురు చొప్పున, అదనంగా 30 శాతం బఫర్‌తో సిబ్బందిని గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల నుండి ఇప్పటి నుండే సమాచారం తీసుకోవాలన్నారు. సమాచారం సేకరణలో ఎవరెవరు సెలవులలో ఉన్నారు, సస్పెండ్ ఎవరయ్యారు, పదవీ విరమణ పొందారు, బదిలీ అయ్యారు లాంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 6 నెలల్లో రిటైర్ అయ్యే వారిని ఎన్నికల విధుల్లోకి తీసుకోకూడదన్నారు. వారు పని చేస్తున్న నియోజకవర్గంలో లేదా సొంత నియోజకవర్గంలో నియమించకూడదని తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ రూమ్స్ లో ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా ఏర్పాట్లు చేపట్టేందుకు ఆర్ అండ్ బి ఎస్ఇ ఇరిగేషన్ ఎస్ఇ టిడ్కో ఎస్ఇ లను నోడల్ అధికారులుగా నియమించామని, వాటిని పరిశీలించి ఇప్పటినుండి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్‌పి జి. కృష్ణ కాంత్ మాట్లాడుతూ కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ , ఐటి నోడల్ అధికారులు అన్ని పోలింగ్ కేంద్రాలకు డిజిటల్ రూట్ మ్యాపింగ్ కు చర్యలు తీసుకోవాలన్నారు. లా అండ్ ఆర్డర్ కి సంబంధించి ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, అదనపు ఎస్పీ సర్కార్, డిఆర్ఒ మధుసూదనరావు, ఇఆర్ఒలు, నోడల్ అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి, ఎఇఆర్‌ఒలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన



జిల్లాను తాకిన మిచౌంగ్ ప్రభావం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు జిల్లాను మిచౌంగ్ తుపాను ప్రభావం తాకింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ జిల్లాలోని ఆరు మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా వెల్దుర్తి మండలంలో 11 మిల్లీమీటర్లు, అత్యల్పంగా సి.బెళగల్ మండలంలో 0.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కల్లూరు మండలంలో 7.8 మిల్లీమీటర్లు, కర్నూలు అర్బన్ మండలంలో 6.8 మిల్లీమీటర్లు, కర్నూలు రూరల్ మండలంలో 6.6 మిల్లీమీటర్లు, ఓర్వకల్లు మండలంలో 3.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 1.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరపి లేని వర్షం కురిసింది. మధ్యాహ్నం తరువాత వర్షం తెరపి ఇచ్చింది. కురిసిన వర్షానికి కర్నూలు నగరంలోని పలు వీధుల్లో స్వల్పంగా నీరు చేరాయి. వర్షపు నీరు ప్రధాన రోడ్లపై ప్రవహించాయి. పత్తి పొలాల్లో మొక్కలకు ఉన్న పత్తి తడిసిపోయింది. పూత దశలో ఉన్న కంది పూత రాలిపోయింది. దీంతో రైతన్నలకు నష్టం వాటిల్లింది.

జిజిహెచ్‌లో ఈ-హాస్పిటల్

-మరింత విస్తృతంగా ఆరోగ్యశ్రీ సేవలు
- జిజిహెచ్ సూపరిన్‌టెన్‌డెంట్ వెంకట రంగారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిజిహెచ్ లో అన్ని విభాగాలలో ఈ హాస్పిటల్ ఇంప్లిమెంటేషన్ జరగాలని ఆసుపత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి హెచ్‌ఒడిలను ఆదేశించారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంత్రి హాల్లో ఆరోగ్యశ్రీ , ఈ హాస్పటల్ అన్ని విభాగాల హెచ్‌ఒడిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ వి వెంకటరంగా రెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రిలోని పలు విభాగాలలో ఆరోగ్యశ్రీ ప్రతి వారం ఇచ్చే టార్గెట్లను పూర్తిచేసిన సందర్భంగా వారికి అనంతరం ఆరోగ్యశ్రీ సేవలను మరింత పటిష్టంగా అమలు చేసిన పలు విభాగాల హెచ్‌ఒడిలను అభినందించారు. గైనిక్ డిపార్ట్‌మెంట్ విభాగాల ఈ హాస్పిటల్ మరింత ఇంప్రూవ్‌మెంట్ చేయాలని సంబంధించిన హెచ్ ఒడిలను ఆదేశించారు. ఈ హాస్పిటల్ ఇంప్లిమెంటేషన్ 60శాతం నుంచి 75 శాతం చేసినందుకు సంబంధించిన హెచ్‌ఒడిలను అభినందించారు. రాష్ట్రంలోనే నెంబర్ వన్ ఈ హాస్పిటల్ ఇంప్లిమెంటేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో సిటీ స్కాన్ , ఎంఆర్ఐ స్కాన్ కు సంబంధించిన రిక్విజేషన్ ఫామ్ లో పేషెంట్ కు సంబంధించిన స్కానింగ్‌లకు ప్రాపర్ గా మెయింటేన్ చేయాలని, అనంతరం పేషెంట్ కు అవసరాలను బట్టి స్కానింగ్ అడ్వైస్ చేయాలని సంబంధించిన హెచ్‌ఒడిలను ఆదేశించారు. క్యాజువాలిటీ విభాగంలోని సిఎంఒలను సంబంధిత సిటీ స్కాన్ , ఎక్సరే రిక్విజేషన్ ఫామ్ మైంటైన్ చేయాలని సిఎంఒలను ఆదేశించారు. హౌస్ సర్జన్స్ , పీజీ,ఎస్ఆర్‌లను అటెండెన్స్ రిజిస్టర్‌లపై ప్రాపర్ గా మైయిటేన్ చేయాలని సంబంధించిన హెచ్‌ఒడిలను ఆదేశించారు. అన్ని విభాగాలలో పెస్ట్ కంట్రోల్ , శానిటేషన్, సెక్యూరిటీ సంబంధించిన వాటిల్లో ప్రతిరోజు ఆసుపత్రి పలు విభాగాలను పరిశుభ్రంగా ఉండే విధంగా సంబంధించిన హెచ్‌ఒడిలను సూపర్వైజింగ్ చేయాలని తెలిపారు. కార్డియాలజీ , కార్డియో థొరాసిక్ విభాగంలో గత నెల 28 న ప్రారంభమై క్యాథల్యాబ్ సేవలు ఇప్పటివరకు 28 ఆంజియోగ్రామ్ , మూడు బైపాస్ సర్జరీలు చేసినందుకు హెచ్‌ఒడిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్, ఆసుపత్రి సి ఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమనలిని, హెచ్‌ఒడిలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ శ్రీలక్ష్మి బాయ్, డాక్టర్ రాధారాణి, ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రంగారెడ్డి



యుటిఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు అర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్ పాటి డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు అర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్ పాటి లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. టీచర్ల పదోన్నతులు బదిలీలను వెంటనే చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారికి పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు , స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు మం జూరు చేయాలని డిమాండ్ చేశారు. నగర శాఖ గౌరవ అధ్యక్షులు జి సర్వేశ్వర్ రెడ్డి, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వరప్రసాద్, ఎస్ ఇబ్రహీం , సీనియర్ నాయకులు పి భాస్కర్ ,ప్రకాష్ రావు, రఫీకుర్ , రహ్మాన్,శివ ప్రసాద్, యుటిఎఫ్ కార్యకర్తలు ఆదినారాయణ ,రవి, చాంద్ బాష, రవీంద్ర నాయక్ ,యు సురేష్ ,మణికంఠ, చాంద్ భాషా పాల్గొన్నారు.

ఆర్‌యు విసికి, రిజిస్ట్రార్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఫజుల్ రెహమాన్‌కు, రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చకు రాష్ట్ర హైకోర్టునాన్ బెయిల్ బుల్ వారెంట్ మంగళవారం జారీ చేసింది. హైకోర్టు ధిక్కార కేసులో వారిద్దరూ న్యాయస్థానానికి హాజరుకాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. యూనివర్సిటీ పరిధిలో ఎంఇడి కళాశాలలకు గుర్తింపు నివ్వకపోవడంపై సదరు కళాశాల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. సదరు ఎంఇడి కళాశాలలకు గుర్తింపు ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. వారుస్పందించలేదు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాలేజీలు హైకోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఇవాళ తమ ముందు హాజరు కావాలని విసి, రిజిస్ట్రార్‌కు ఆదేశాలు ఇచ్చింది.

పల్లెపాలనకు పంచాయతీ కార్యదర్శులు కీలకం

ప్రజాశక్తి-సి బెళగల్

పల్లెలు అభివృద్ధి చెందాలంటే పంచాయతీ కార్యదర్శులు అందించే పాలన కీలకమని ఎంపిడిఒ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి సందీప్ లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మండలంలో పల్లెప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి ఆదాయ వనరులు పెంచాలని అన్నారు. పంచాయతీల పరిధిలో ఇసుక, ఎర్రమట్టి, ఇతర లే అవుట్ , వాణిజ్య పరిశ్రమల నుండి వనరులు సేకరించి, ప్రభుత్వం నుండి నిధులు రాబట్టాలని పేర్కొన్నారు.

టాఫిక్స్ సిగ్నల్స్ పని చేయకున్నా జరిమానాలు ఎలా ?

పట్టణ పౌరసంక్షేమ సంఘం



పని చేయని సిగ్నల్ వద్ద పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : నగరంలో నిబంధనల ప్రకారం ట్రాఫిక్ సిగ్నల్స్ నెలల తరబడి పని చేయకపోయినా సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సెన్సార్ కెమెరాల జరిమానాలతో రోడ్డుపైకి రావాలంటే భయపడాల్సి వస్తుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో కొన్ని కూడళ్లలో సెన్సార్ సిసి కెమెరాలు బిగించి ప్రభుత్వ అధికారులు చేతులు దులుపుకున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి విమర్శించారు. మంగళవారం పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం స్థానిక ప్రజలతో కలిసి సిసి కెమెరాలతో పాటు సిగ్నల్ లైట్లను పరిశీలించారు. రోడ్లపై వెళ్లే వాహనదారులతో జరిమానాల నోటీసుల గురించి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఎరుపు పశుపు పచ్చ తరువాత ఆకుపచ్చ సిగ్నల్స్ పడాలి కానీ పంప్ హౌస్ సమీపంలోని సిగ్నల్స్ ఎరుపు పచ్చ సిగ్నల్స్ మాత్రమే పడుతున్నాయని, దీనివల్ల ప్రజలపై వేల రూపాయల్లో భారాలు పడుతున్నాయని, సిగ్నళ్లకు సమీప సీతారామ నగర్ శ్రీనివాసుకు తన యాక్టివా ద్విచక్ర వాహనానికి ఈ మధ్యకాలంలోనే రూ.నాలుగున్నర వేల జరిమానాల నోటీసులు వచ్చాయన్నారు. మరో టాటా ఎసి పాల వాహనానికి రూ.7,000 జరిమానా వచ్చిందని ఎలా చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేయని సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా వేలకు వేలు పేద మధ్యతరగతి ప్రజల కష్టార్జితాన్ని కొల్లగొట్టి పెరిగిన ఆదాయం ద్వారా ప్రభుత్వ మెప్పు పొందాలని చూపిస్తున్నారా అని అధికారులను ప్రశ్నించారు. గీత దాటారని చెప్పి ప్రజలకు భారీ జరిమానాలు విధించే ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వ అధికారులు రోడ్లపై నిబంధనల ప్రకారం తెల్ల రంగుతో జీబ్రా లైన్లు కూడా వేయని ప్రభుత్వ అధికారులకు ఫైన్‌లు ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సిగ్నల్ లైటింగ్ వ్యవస్థను మరమ్మతులు చేసి సెన్సార్ కెమెరాలను వాటి ద్వారా వేసిన జరుమానాలను రద్దు చేయాలని కోరారు. ఈ పర్యటనలో స్థానికులు కె. శ్రీనివాసులు, సత్తార్‌బాష, సోమన్న, నగేష్, అన్వర్, కుమార్ పాల్గొన్నారు.

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలి

ఎంపిపి కార్యాలయంలోకి దూసుకెళ్లిన సిపిఐ, సిపిఎం

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలిని కరువు మండలంగా తక్షణమే ప్రకటించాలని సిపిఐ, సిపిఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శనగా ఎంపిపి కార్యాలయంలోకి దూసుకెల్లడంతో పోలీసులు అడ్డగించారు. దీంతో రైతులు, రైతు సంఘం నాయకులు ఎంపిపి కార్యాలయంలోకి దూసుకెళ్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. సర్వసభ్య సమావేశంలో సభ్యులంతా కలిసి తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని తీర్మానం చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూలు, సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. తీవ్ర వర్షాబావ పరిస్థితుల్లో కారణంగా రైతులు వ్యవసాయ కూలీలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతుంటే ప్రభుత్వం మాత్రం మండలాన్ని కరువు మండలం గా ఎందుకు ప్రకటించ లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తుగ్గలిని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని, లేనిపక్షంలో దశల వారీగా ఆందోళనలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్, వెంకటేశు, శ్రీనివాసులు, కొండారెడ్డి, ఉమా మహేశ్వరరావు, పీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు.



ఎంపిపి కార్యాలయంలోకి దూసుకెళ్లిన సిపిఐ, సిపిఎం నాయకులు ,తహశీల్దార్‌కు వినతి ఇస్తున్న నాయకులు

కరువు మండలానికి ఏకగ్రీవ తీర్మానం

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు పట్టుబట్టారు. దీంతో చేసేది లేక కరువు మండలంగా ప్రకటించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళవారం ఎంపిపి కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపిపి ఆదెమ్మ అధ్యక్షతన జరిగింది. ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సహకరించాలన్నారు.

తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సభ్యులు పట్టు పట్టారు. దీంతో ఏకపక్షంగా తీర్మానం చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. తహశీల్దార్‌రవి, ఎంఇఒ వెంకటేశ్వర్లు, ఎఒ పవన్ కుమార్, ఇఒఆర్‌డి తిరుపాల్,వైస్ ఎంపిపిలు మల్లికార్జునరెడ్డి, ఎర్రన్న నాగప్ప, ,ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.



జగనన్నను మరోసారి దీవించాలని కోరుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

వర్షంలోనూ గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్ ఖాన్ వర్షాన్నికూడా లెక్కచేయకుండా కొనసాగించారు. 24వ వార్డ్ 60వ, 61వ సచివాలయం పరిధిలో లక్ష్మీనగర్, మధుర్ నగర్ వీధిలో కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్‌కు పూలదండలు బొకేలతో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం మన వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మరోసారి జగనన్నని ఆశీర్వదించాలని కోరారు. స్థానిక నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అసిఫ్, డిష్ రాజు, సునీల్, సుచరిత, అర్చన్, అబ్బాస్ అలీ, అనీస్ ఖాన్, కల్పన, మధు, పి.కిషోర్, మల్లికార్జునరెడ్డి, ముఖ్య నాయ కులు వైసిపి నాయకులు, సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు పై సంబరాలు

ప్రజాశక్తి-మద్దికేర



తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు పై మద్దికేర మండల పరిధిలోని మదనంత పురంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణలో ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ వైపై మొగ్గుచూపుడం, రేంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. మద్దికెర కాంగ్రెస్ వార్డ్ మెంబర్ పుష్పావతి, రామచంద్ర, శ్రీనివాసులు, రామాంజనేయులు, శివయ్య, సోమాజి, మాజీ ఎంపిటిసి ఎల్లప్ప పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టడం అభినందనీయమని అన్నారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు.

బాధ్యతతో క్రీడలు నిర్వహిస్తాం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం.. ఆంధ్ర' టోర్నమెంట్‌లో భాగంగా క్రీడలను బాధ్యతతో నిర్వహిస్తామని ఎంపిడిఒ సిపి.కొండయ్య తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో ప్రభుత్వం అందజేసిన క్రీడా సామగ్రిని ఆయా పంచాయతీల కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 9 సచివాలయాల్లో 'ఆడుదాం.. ఆంధ్ర' క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయం చేసుకొని క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. మహిళలు కూడా క్రీడల్లో పాల్గొనాలని, వారికి చేదోడుగా మహిళా పోలీసులు ఉంటారని చెప్పారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఇఒఆర్‌డి బాలన్న, సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు'

- వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రజలకు వివరిస్తున్న ప్రదీప్ రెడ్డి

గ్రామాల్లోని నెలకొన్న సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహిస్తున్నట్లు వైసిపి రాష్ట్ర యువ నేత వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో మంగళవారం రాఘవేంద్రపురం సచివాలయం-3లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. కాలనీ చేరుకున్న ప్రదీప్‌రెడ్డికి సర్పంచి తెల్లబండ్ల భీమయ్య పూలమాల వేసి స్వాగతం పలికారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను చూపించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. చర్యలు తీసుకోవాలని ఎఇ గోవిందును ప్రదీప్‌రెడ్డి కోరారు. ఇళ్ల స్థలాలు లేక పూరి గుడిసెల్లో నివసిస్తున్నామని, వర్షాలు కురిస్తే తమ పరిస్థితి అధ్వానంగా ఉంటుందని, న్యాయం చేయాలని స్థానికులు కోరారు. స్పందించిన ఆయన... రెండో విడత పట్టాల పంపిణీలో కచ్చితంగా ఇళ్ల స్థలాలను ఇస్తామని హామీ ఇచ్చారు. రేషన్ బియ్యం పంపిణీ వాహనం ఇళ్ల వద్దకు సక్రమంగా రావడం లేదని ఫిర్యాదు చేయగా, ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఎంపిడిఒ మణిమంజరి, ఎఇ జీరా గణేష్, హెడ్ కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుల్ రఘు, వైసిపి నాయకులు పెట్రోలు బంక్ శీను, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ విజిసి రాఘవేంద్ర ఆచారి, ఉప సర్పంచి హోటల్ పరమేష్, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదు

- డిస్ట్రిక్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, నిబంధన అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని డిస్ట్రిక్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఆర్యిట్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో నోడల్ ఆఫీసర్ సుమలత అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఆర్యిట్ సిఇఒ ఆర్యిట్ హుస్సేన్, ఆర్యిట్ సెంటర్ డాక్టర్లు వినయ్, మధుసూదన్, మేనేజర్ సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఐఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ వినయ్ మాట్లాడారు. ఆడపిల్లల పట్ల చులకన భావన ఉండడం, వివక్ష చూపడం దురదృష్టకరమని తెలిపారు. గర్భం సమయంలో ఆడ, మగ తెలుసుకుని గర్భంలోనే ఆడ శిశువును అంతమొందించిన ఘటనలు ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేయించుకున్నా చట్టరీత్యా శిక్షలు ఉన్నాయని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న వారికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తారని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్ష చేసిన డాక్టర్లకు ఎంబిబిఎస్ సర్టిఫికెట్ రద్దు చేస్తారని తెలిపారు.

'జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి -పెద్దకడబూరు

ఈనెల 15న కర్నూలులో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతుసంఘం జిల్లా నాయకులు పరమేష్, నాయకులు హనుమంతు, శ్రీనివాసులు కోరారు. మంగళవారం మండలంలోని కల్లుకుంటలో గోడపత్రికలను విడుదల చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు.

జోరుగా సాగుతున్న 'రియల్' దందా..!

- ప్రభుత్వ నిబంధనలు గాలికి.. - ఆదాయానికి గండి..!

ప్రజాశక్తి - కౌతాళం

పెద్ద పెద్ద పట్టణాలు, నగరాల నుంచి రియల్ ఎస్టేట్ దందా గ్రామీణ ప్రాంతాలకు వ్యాపించింది. అక్రమ సంపాదనే ధ్యేయంగా కొంతమంది రియల్ ఎస్టేట్ ద్వారా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అమాయకుల మధ్య పోటీ పెట్టి ప్లాట్లను (ఇంటి స్థలాలు) అంటగట్టి అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్లు చేయించి మోసానికి వడిగడుతున్నారు. ఇలాంటి ఘటనలు కౌతాళం, బాపురం గ్రామాల్లో వెలుగు చూస్తున్నాయి.



హనుమాన్ నగర్ పక్కన ఉన్న పొలంలో ప్లాట్లు

ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న కౌతాళంపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. గ్రామంలో శివప్ప నగర్ పక్కన, కొత్త పెట్రోల్ బంకు హనుమాన్ నగర్ పక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ వేసి విక్రయాలు కొనసాగిస్తున్నారు. వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేసి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రజలకు అంటగడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు, గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా ప్లాట్లు వేశారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేయడం వల్ల జరిగే నష్టం తెలియక ప్రజలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల మోసాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. రిజిస్టర్ కార్యాలయంలో కూడా అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్ చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అండగా నిలుస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ నిబంధనలు ఇలా...

పట్టా భూముల్లో వెంచర్లు వేయాలంటే 443 జిఒ-2017 ప్రకారం పంచాయతీల్లో పలు నిబంధనలు ఉన్నాయి.

1. వెంచర్ వేసే స్థలం నివాసయోగ్యంగా ఉండాలి.
2. వ్యవసాయ భూములను నివాస స్థలాలుగా లే అవుట్ చేయాలంటే మొదట వాటిని నివాస స్థలాలుగా కన్వర్షన్ చేయాలి. అందుకు రెవెన్యూ అధికారుల నుండి అనుమతి తీసుకొని, భూమి విలువలో 3 శాతాన్ని చెల్లించాలి.
3. తర్వాత స్థానిక పంచాయతీ నుంచి లే అవుట్ వేయడానికి అనుమతి తీసుకోవాలి. దరఖాస్తుతో పాటు లే అవుట్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్ కింద మరికొంత చెల్లించాలి. ఈ అనుమతులు పొందిన తర్వాత వెంచర్లకు కేటాయించిన స్థలంలో పది శాతం భూమిని పార్కులు, ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం, ఇతర అవసరాల కోసం కేటాయించాలి.
4. ప్లాన్ అప్రూవల్ పక్కాగా ఉండాలి. ఈ ప్లాన్ ప్రకారం మాత్రమే ప్లాట్లు వేస్తున్నారని తేలాకే విద్యుత్ శాఖ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి. సంబంధిత పంచాయతీ సమన్వయం చేసుకొని సరి చూసుకోవాలి.
5. ఈ అనుమతులన్నీ వచ్చాకే ప్లాట్లు అమ్మకం చేపట్టాలి. ఇవేవీ క్షేత్రస్థాయిలో అమలవుతున్న దాఖలాలే లేవు.
6. రిజిస్ట్రేషన్ శాఖపై మార్గదర్శకాలన్నీ పాటించారో లేదో సరిచూసుకున్నాకే రిజిస్టర్ చేయాలి. ఆ శాఖ కూడా ఇవి పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. సామాన్యులు ప్లాట్లు కొని ఇళ్లు కట్టుకునే సమయంలో వివిధ రకాల అనుమతుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇవేవీ లేకుండా నిబంధనలను తుంగలో తొక్కుతూ లే అవుట్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

అధికారులు స్పందించాలి

ప్రభుత్వ నిబంధనలు, పంచాయతీ అనుమతులు లేకుండా క్రయవిక్రయాలు జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు స్పందించడం లేదు. అమాయకులు ఇలాంటి ప్లాట్లను కొని భవిష్యత్తులో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలకు దూరం కావాల్సిన పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో ప్లాట్లను కొనుగోలు చేసి అనేక ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుంది. ప్రజలు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న ప్లాట్లను కొనుగోలు చేసి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పంచాయతీ అనుమతి తప్పనిసరి

- సర్పంచ్ పాల్ దినకరన్, పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య



గ్రామంలోని ఎలాంటి లేఅవుట్ వేయాలన్నా లేదా బిల్డింగ్‌లు నిర్మించాలన్నా జిఒ 443 ప్రకారం కుండా, పంచాయతీ అనుమతి తప్పకుండా తీసుకోవాలి. లేకపోతే పంచాయతీ ద్వారా ఎలాంటి కలెక్షన్లు, ఇతర అవసరాలకు పంచాయతీ బాధ్యులు కాదు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి

- జడ్‌పిటిసి కిట్టు

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి భర్త లుముంబా, వైసిపి నాయకులు ప్రతాప్ తెలిపారు. మంగళవారం మండలంలోని పాలకుర్తి గ్రామంలో సర్పంచి సుధారాణి అధ్యక్షతన 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకుందామని కోరారు. సంక్షేమ పథకాల ద్వారా గ్రామానికి రూ.12.09 కోట్లను అందించినట్లు చెప్పారు. తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, సచివాలయ కన్వీనర్లు నాగరాజు, సువర్ణ, గ్రామ పెద్దలు జాకరయ్య, ఏలియా, గిడ్డన్న, గ్రామైక్య సంఘం లీడర్ భాగ్యమ్మ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని సూగూరు గ్రామంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును ఎంపిడిఒ మణిమంజరితో కలిసి వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి ఆవిష్కరించారు. సూగూరులో ఇప్పటి వరకు రూ.26,51,84,005 ఖర్చు చేసినట్లు తెలిపారు. **కోసిగి** మండలం పెద్దబొంపల్లి, చిన్నబొంపల్లి గ్రామాల్లో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యఅతిథిగా జెసిఎస్ కన్వీనర్ పి.మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఎంపిపి ఈరన్న, వైసిపి మండల అధ్యక్షులు బెట్టనగౌడ్ ఆధ్వర్యంలో వైసిపి జెండాను, సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎంపిటిసి జోల్లయ్య, గట్టు భీమయ్య, ఉసేని, రొడ్డ లక్ష్మయ్య, దొమ్మయ్య, గడ్డం అంజినయ్య, జంగం అంజినయ్య, వీరారెడ్డి, రాగప్ప, అంజి, సామేల్, రాజేష్ పాల్గొన్నారు. **హోళగుంద** మండలం ఎల్లార్తి సచివాలయంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఎంపిడిఒ సుభాషిణి, ఇఒఆర్‌డి చంద్రమౌళీశ్వర గౌడ్, జెసిఎస్ కన్వీనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. దరగప్ప, ఎస్‌కె.గిరి, ఎంపిటిసి శివన్న, శేషి, షేకన్న, ఎల్లా రెడ్డి పాల్గొన్నారు.



పాలకుర్తి (దేవనకొండ)లో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



మంత్రాలయంలో బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



కోసిగిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలాన్ని తీవ్ర కరువుగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, పాండవుగల్ సర్పంచి కె.ఉమాదేవి డిమాండ్ చేశారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు పత్తికి ఎకరాకు రూ.50 వేలు, మిరపకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం అందజేయాలని కోరారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి, రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు బ్యాంకు రుణాలన్నింటినీ మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని, ఎల్‌ఎల్‌సికి డిసెంబర్ ఆఖరి వరకు సాగునీరందించాలని కోరారు. రైతులకు ఉచిత విద్యుత్ 9 గంటలు రెండు దఫాలుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. రైతు కూలీ సంఘం నాయకులు ప్రసాద్, రైతు సంఘం మండల అధ్యక్షులు శేఖర్, మండల నాయకులు హనుమంతురెడ్డి, బాష, రహిమాన్ పాల్గొన్నారు. **దేవనకొండ** తహశీల్దార్ కార్యాలయం ముందు వ్యకాస, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తహశీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, ప్రజాసంఘాల నాయకులు రాయుడు, మహేష్, గుడిమరాళ్ల కౌలుట్ల, రంగస్వామి, రామాంజనేయులు, ఎల్లప్ప పాల్గొన్నారు. **కోసిగి** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ రుద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, వ్యకాస మండల కార్యదర్శి కడదొడ్డి నాగేంద్ర, ఆదెప్ప, చింతకుంట ఈరన్న, నరసింహులు, చిన్నారెడ్డి, శంబన్న, చిన్న కోసిగయ్య, చిన్నన్న, చిన్నా రెడ్డి, గోపాల్, కాళింగ, వీరారెడ్డి పాల్గొన్నారు. **పెద్దకడబూరు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేపట్టారు. రైతు సంఘం జిల్లా నాయకులు పరమేష్, వ్యకాస మండల కార్యదర్శి తిక్కన్న రైతులకు మద్దతు తెలిపారు. తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. తాయప్ప, ఆంజనేయ, ఉప్పర శ్రీనివాసులు, ఈరన్న పాల్గొన్నారు.



ఆదోనిలో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వెంకటేశులు

ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1.31 కోట్లు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1,31,06,361 వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వాణి తెలిపారు. మంగళవారం ఉరుకుందలోని డార్మెటరీ హాలులో హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ నగదుతో పాటు బంగారం 62 గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 22 కిలోల 100 గ్రాములు వచ్చిందని ఆమె తెలిపారు. పాలకమండలి ఛైర్మన్ ఆర్.నాగరాజ్ గౌడ్, పాలకమండలి సభ్యులు, హుండీ పర్యవేక్షణ అధికారి పిసి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి : టిడిపి

ప్రజాశక్తి - హోళగుంద

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య తెలిపారు. మంగళవారం టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు హోళగుందలోని ఇంద్రనగర్ కాలనీలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించే పథకాల గురించి వివరించారు. ఐటిడిపి తాలూకా కార్యదర్శి హనుమంతు, బూత్ ఇన్‌ఛార్జీ సాయిబేష్, బుడగ జంగాల రామాంజి, శీను, నరసింహ, మౌన పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐగా శరత్ కుమార్ రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రకోట గ్రామంలో ఎమ్మెల్యే స్వగృహంలో వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని తెలిపారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని బిల్లేహాల్ గ్రామంలో తాగునీటి కోసం పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు రిలయన్స్ ఫౌండేషన్ ఆర్డిప్ సంస్థ ప్రతినిధి తులసి రాముడు, సర్పంచి ఉల్లిగప్ప తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థలు గతేడాది నుంచి బిల్లేహాల్ గ్రామంలో వివిధ అంశాలపై పని చేస్తోందని తెలిపారు. పంచాయతీలో వాతావరణ మార్పులకు ఆధారంగా చేపట్టాల్సిన చర్యలపై పంచాయతీ సభ్యులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారని తెలిపారు.

జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి-ఆలూరు

జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేసే వరకు పోరాడాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్ బాష కోరారు. బుధవారం ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరంగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. షాబీర్ బాష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులుగా వినేష్ బాబు, ప్రధాన కార్యదర్శి గాది లింగ, మహిళా కన్వీనర్‌గా కల్యాణి బాయి, కో కన్వీనర్‌గా దీపికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రామాంజనేయులు, పట్టణ నాయకులు మంజు, మోహన్ పాల్గొన్నారు.

'వికలాంగులకు అండగా ఉంటాం'

ప్రజాశక్తి - ఆస్పరి

వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ఆస్పరిలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో వికలాంగులు అన్ని రంగాల్లోనూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వికలాంగులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు మేనేజర్ అమర్‌నాథ్ శ్రీనివాసులును కోరారు. వెలుగు సిసి మస్తాన్, సెక్రెడ్ కోఆర్డినేటర్ రామాంజనేయులు, ఆర్థోటెక్నీషియన్ ఆది శేషయ్య, స్పీచ్ తెరపిస్టు వీరాంజనేయులు, ఆదర్శ మండల వికలాంగుల సమైక్య అధ్యక్షులు వీరేంద్ర, వీరేష్, లక్ష్మన్న, చిన్నస్వామి, కార్యకర్త వీరశేఖర్, వెన్నెల మహిళా వికలాంగుల సమైక్య మెంబర్ వేదవతి, నాగలక్ష్మి, అరుణ కుమారి, మహాదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-ఆదోని

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రత కోసం అధికారులు కృషి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ సమావేశాన్ని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్కూల్ ఆటోలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తుంటే వాటిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌గా గుర్తించి అక్కడ నేమ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ ప్రదేశంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమస్య లేకుండా చూడాలని తెలిపారు. రోడ్ సేఫ్టీకి సంబంధించిన నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించి ప్రమాదాలకు గురి కాకుండా ప్రజలకు తెలియజేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీఎస్పీ శివ నారాయణస్వామి, ఆర్‌టిఒ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, నేషనల్ హైవే ఎఇ శ్రీహరి పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను నివారిద్దాం

సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణ హత్యలను నివారించేందుకు కృషి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పిసి పిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో భ్రూణ హత్యల నివారణ, పిసి పిఎన్‌డిటి చట్టంపై డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్ల యాజమాన్యం, గైనకాలజిస్ట్ డాక్టర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రుల ఆలోచన విధానంలో మార్పు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమని తెలిపారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంగించిన వారిపై రూ.50 వేల జరిమాన నుంచి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. పిసి పిఎన్‌డిటి చట్టం ప్రకారం స్కానింగ్ కేంద్రాలపై కచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకూ బహుమతి అందించే అవకాశం ఉందన్నారు. డివిజన్ పరిధిలో ఉన్న 48 స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి నూతన రిజిస్ట్రేషన్లు, రెన్యువల్, సిబ్బంది, చిరునామా, పరికరాల్లో మార్పులపై పరిశీలించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కానింగ్ సెంటర్ల అనుమతులు రద్దు చేస్తామన్నారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, డాక్టర్ మాధవీలత, పిసి పిఎన్‌డిటి జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సిఐ పార్థ సారథి, డిస్ట్రిక్ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

- యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జీవిత

ప్రజాశక్తి - కౌతాళం





యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జీవిత, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. మంగళవారం వారు మాట్లాడారు. కర్నూలులో ఆదివారం యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. మండలం నుంచి బి.జీవితను జిల్లా సహాధ్యక్షులుగా, జి.శ్రీనివాసులును యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, యుటిఎఫ్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు నాయకులు సిద్ధంగా ఉండాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు బసప్ప, కిష్టన్న, బాలాజీరావు, నారాయణ, సుధాకర్, రంగన్న, రాజా హుస్సేన్, మంగరాజు, భాస్కర్, రామాంజనేయులు, నాగరాజు, లింగన్న, సుధాకర్ నాయక్, రంగారెడ్డి, ఆజాద్, ఈరన్న, రాజీవ్, తేజప్ప, దేవేంద్ర బాబు, లక్ష్మీ కాంత్ రెడ్డి, మల్లికార్జున, అంబరీష్, విజయలక్ష్మి, వీరశ్రీ, విమల, సంధ్య జ్యోతి, శిరీష, ద్రాక్షమ్మ, విజయ కుమారి హర్షం వ్యక్తం చేశారు.

శ్మశాన వాటికలో ముళ్లకంప తొలగింపు, హద్దులు ఏర్పాటు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



జెసిబితో పనులు చేయిస్తున్న నాయకులు

మండలంలోని దైవందిన్నె గ్రామంలో శ్మశాన వాటికకు ముళ్ల కంపను తొలగించి, హద్దులు ఏర్పాటు చేశారు. గతంలో సమస్యపై మాల మహానాడు రాష్ట్ర నాయకులు రంగయ్య, జిల్లా అధ్యక్షులు మల్లేష్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని గ్రామస్తులతో రంగయ్య, మల్లేష్‌లు తహశీల్దార్‌కు దరఖాస్తు చేయించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. సమస్యను పరిష్కరించాలని సర్పంచి రంగన్నను తహశీల్దార్ ఆదేశించారు. మల్లేష్ దగ్గరుండి జెసిబి పంపి దైవందిన్నె సర్పంచితో పనులను ప్రారంభించారు. మల్లేష్ దగ్గరుండి పని చేయిస్తున్నందుకు గ్రామ మాలలు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. రంగయ్య మాట్లాడుతూ... ప్రభుత్వంతో పని చేయించుకోవడం మన హక్కు అని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని తెలిపారు. సర్పంచి రంగన్న, మాల మల్లేష్, పెద్ద నరసన్న, నరసింహులు, జమ్మన్న, నరసింహులు, ఆంజనేయ పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న మధుసూదనశర్మ

ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని 35వ వార్డు పంజారా పోల్ కాలనీలో దీపం పథకం కింద మంజూరైన ఉచిత గ్యాస్ సిలిండర్లు, పొయ్యి, రెగ్యులేటర్లను మంగళవారం వైసిపి జిల్లా కార్యదర్శి మధుసూదన శర్మ అర్హులైన మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంతవరకు రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు ద్వారా గ్యాస్ కనెక్షన్ లేకుండా ఉంటారో, వారందరూ వాలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఉచిత గ్యాస్ కనెక్షన్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కురువ రవికుమార్, అబ్రహం, అగ్గి రాముడు, తిక్కన్న, సులోచనమ్మ, దీపమ్మ, వాలంటీర్లు మునిస్వామి, తిమ్మప్ప పాల్గొన్నారు.

పాలనపై కార్యదర్శులకు శిక్షణ

నందవరం : గ్రామాల్లో పంచాయతీ పాలన ఎలా ఉండాలి, కార్యదర్శులు ఏ విధంగా పని చేయాలని కార్యదర్శుల విధులపై ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ గ్రేడ్-1 నుంచి 4 వరకు కార్యదర్శులకు మంగళవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ దశరథ రామయ్య, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి మాట్లాడారు. గ్రామ పాలనలో పంచాయతీ కార్యదర్శులు కీలకమని, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పంచాయతీలకు నిధులు రాబట్టేందుకు కార్యదర్శి చొరవ తీసుకోవాలని, గ్రామ పరిధిలో జరిగే పనులపై ఆరా తీసి కచ్చితంగా చలానాలు కట్టించి పంచాయతీ ఆదాయానికి కృషి చేయాలని చెప్పారు. ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఎఇ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ముస్లింలను దగా చేస్తున్న వైసిపి : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీలకు నిధులు కేటాయించకుండా వైసిపి ప్రభుత్వం దగా చేస్తోందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. మంగళవారం ఆదోనిలోని ఖానీమొహల్లా, మేదర్ మసీదు మైనార్టీ వార్డుల్లో పర్యటించారు. మైనార్టీ సమస్యలపై ముస్లిం నాయకులు సైఫుల్లా, అల్తాఫ్ హుసేన్, జాఫర్ హుస్సేన్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో పూర్వ వైభవానికి కృషి చేయాలని కోరారు. త్వరలో ఆదోని ముస్లిం, మైనార్టీ నాయకులకు పార్టీ అనుబంధ కమిటీల్లో అవకాశాలు వస్తాయన్నారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, పట్టణ ముస్లిం, మైనార్టీ నాయకులు సాధిక్ వలీ, నాగేంద్ర, ఇందిరా నగర్ వీరేష్, భారత్ కుమార్ పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న గుడిసె ఆది కృష్ణమ్మ





జిల్లాలో 'మిచౌంగ్' ప్రభావం

- ప్యాపిలి మినహా మిగతా అన్ని మండలాల్లో వర్షం
- అత్యధికంగా శ్రీశైలంలో 40.4 మి.మీ
- అత్యల్పంగా కొత్తపల్లె, పాములపాడు మండలాల్లో 0.4 మి.మీ నమోదు
- రుద్రవరం మండలంలో వెయ్యి ఎకరాల్లో నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాపై మిచౌంగ్ తుఫాన్ ప్రభావం పడింది. సోమవారం సాయంత్రం ఐదున్నర గంటలకు నంద్యాల జిల్లా కేంద్రంలో చిరుజల్లులతో మొదలై మంగళవారం మధ్యాహ్నం వరకు జిల్లా వ్యాప్తంగా ప్యాపిలి మినహా మిగతా అన్ని మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఈదురు గాలులు వీచాయి. ఈదురు గాలులు వీచడంతో వరి పంట నేలకొరిగింది. అత్యధికంగా శ్రీశైలం మండలంలో 40.4 మిల్లీమీటరర్ల వర్షపాతం నమోదయింది. అత్యల్పంగా కొత్తపల్లె, పాములపాడు మండలాల్లో 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. ప్యాపిలి మండలంలో చినుకు జాడ లేదు. జిల్లా వ్యాప్తంగా నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చాగలమర్రి 14.4 మి.మీ, రుద్రవరం 12.2, సంజామల 10.4, మహానంది 9.4, నందికొట్కూరు 9.2, డోన్ 8.4, ఉయ్యాలవాడ 7.6, ఆళ్లగడ్డ 6.2, కొలిమిగుండ్ల 6.2, కోవెలకుంట్ల 5.0, బేతంచెర్ల 4.8, దొర్నిపాడు 4.6, మిడ్తూరు 4.2, గోస్పాడు 4.0, వెలుగోడు 3.2, అవుకు 3.2, బండి ఆత్మకూరు 2.8, నంద్యాల 2.8, సిరివెళ్ల 2.6, జూపాడు బంగ్లా 2.4, పాణ్యం 2.0, బనగానపల్లె 1.8, గడివేముల 1.4, పగిడ్యాల 1.2 , ఆత్మకూరు 0.6, కొత్తపల్లె 0.4, పాములపాడు 0.4, ప్యాపిలీ 0.0 వర్షపాతం నమోదైంది.

రుద్రవరం మండలంలో వెయ్యి ఎకరాల్లో నేలకొరిగిన వరి పంట

రుద్రవరం : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో రుద్రవరం మండలంలో మంగళవారం తెల్లవారు జాము నుంచి ఉదయం 11 గంటల వరకు వర్షం కురిసింది. మండలంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. మండలంలో రైతులు దాదాపు 6 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. మండల కేంద్రం రుద్రవరంతో పాటు ఆర్.నాగులవరం, రెడ్డిపల్లి, అప్పనపల్లి, పెద్ద కంబలూరు, చిన్నకంబలూరు, ఎల్లావత్తుల, కోటకొండ, చందలూరు, మందలూరు, కొండమాయపల్లి, బి.నాగిరెడ్డి పల్లె, శ్రీరంగాపురం, టి.లింగందిన్నె, నరసాపురం, హరినగరం, తిప్పారెడ్డిపల్లి, తువ్వపల్లి తదితర గ్రామాలలో కోత దశలో ఉన్న వరి పంట గాలి వానకు నేల కొరిగింది. పంట నేలకు ఒరిగి పూర్తిగా దెబ్బతింది. రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసి చేతికందే సమయంలో తుఫాను కారణంగా దెబ్బతినడంతో ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాలలో రైతులు తుఫాను రాకముందే పంటలు కోత కోసి కల్లాలో ఆరబెట్టిన ధాన్యం వర్షం కురవడంతో తడిసింది. కొన్ని గ్రామాల్లో ధాన్యం తడిసి పోకుండా రైతులు టార్పాలియన్లు కప్పారు. తడిచిన ధాన్యంను వ్యాపారులు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తారా లేదోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న వరి పంటను, తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



రుద్రవరం మండలంలోని మాచినేనిపల్లె గ్రామంలో దెబ్బతిన్న వరి పంట



రుద్రవరం మండలం అప్పనపల్లె గ్రామంలో వరి ధాన్యంపై టార్పాలియన్లు కప్పిన రైతులు

ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రైతాంగం పండించిన అన్ని రకాల పంటలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, తద్వారా మధ్య దళారుల దోపిడీ నుండి రైతాంగాన్ని రక్షించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో వరి, మొక్క జొన్న, మినుము ధాన్యంను కల్లాల్లో ఆరబెట్టు కునేందుకు, అమ్ముకునేందుకు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇందుకు ప్రధాన కారణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడమేనని అన్నారు. రైతుల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు మధ్య దళారులతో కుమ్మక్కై పంటలు వచ్చినప్పుడు కొనుగోలు చేయడానికి ముందుకు రాకుండా, రైస్ మిల్లర్లు, మధ్య దళారుల చేతికి పంటలు వెళ్లినప్పుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మధ్య దళారుల లాభాలు పెంచుతున్నారని తెలిపారు. ఆరుగాలం కష్టపడిన అన్నదాతల ఆత్మహత్యలకు కారణమవుతున్న మధ్య దళారుల దోపిడీని అరికట్టడం లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయడం లేదని చెప్పారు. కనీసం రైతాంగం పండించుకున్న పంటలను ఆరబెట్టు కోవడం కోసం సరైన కల్లాల వసతి కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. వర్షాల నుండి పంటలు తడవకుండా రక్షించుకోవడం కోసం గతంలో ఇచ్చే టర్పాలిన్ పట్టాలను కూడా ప్రస్తుత ప్రభుత్వాలు ఇవ్వడం లేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, మార్కెట్‌యార్డు చైర్మన్ వెంటనే జోక్యం చేసుకొని ప్రస్తుత తుఫాను ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకు నేందుకు వెంటనే ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో అన్ని రకాల పంటల కొనుగోలును ప్రారంభించా లని డిమాండ్ చేశారు. రోడ్ల వెంట ఆర బోసుకున్న ధాన్యం తడిసి పోకుండా ఉండేందుకు టార్పాలిన్ పట్టాలను సరఫరా చేయాలన్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో కర్నూలులో అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమావేశాల్లో భాగంగా మొదటి రోజు జరిగే బహిరంగ సభ, ప్రదర్శనలో జిల్లాలోని రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామ చంద్రుడు, జిల్లా నాయకుడు గుర్రంశంకర్, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

ఈవిఎంల పనితీరు ప్రదర్శనపై సంపూర్ణ శిక్షణ : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈవిఎంల పనితీరు ప్రదర్శనపై సంపూర్ణ శిక్షణ పొంది ప్రజల్లో అవగాహన తీసుకురావాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఈవిఎంల పనితీరుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈవీఎంలలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాడ్ తదితర పరికరాల వినియోగం, ఓటు వేసే విధానం తదితర అంశాల్లో ఎలాంటి సందేహాలు ఉన్నా మాస్టర్ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలన్నారు.

పిల్లలందరూ బడుల్లోనే ఉండాలి

- ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలి
- వాలంటీర్ల బృందాలు ఇంటింటికి వెళ్లి పిల్లలను గుర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేలో భాగంగా చిన్న చిన్న కారణాల వల్ల బడికి వెళ్ళని బడిఈడు పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలలకు పంపేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పేర్కొన్నారు. 5-18 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఖచ్చితంగా పాఠశాలల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం నంద్యాలలోని డిఇఒ కార్యాలయంలోని జిఇఆర్ సర్వేపై ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తహశీల్దారు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, ఎంఈఓ, పాఠశాలల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో మిగతా 6వ పేజీలో..



బడి బయట ఉన్న చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఇసుక లేదు.. పనీ లేదు..

- దయనీయంగా భవన నిర్మాణ కార్మికుల బతుకులు
- పట్టించుకోని ప్రభుత్వం, పాలకులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక లేకుండా పోయింది. దీంతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడి పని చేసే కార్మికులకు పని లేకుండా పోయింది. కార్మికుల బతుకులు దయనీయంగా మారిపోయాయి. ప్రభుత్వం, పాలకులు భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోకపోవడంతో పూట గడవడం కష్టంగా మారింది...

ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. నిర్మాణ రంగంలో దాదాపు 36 రకాల పనులు చేసేవారున్నారు. బోర్లు తీసేవారు, రాడ్ బెండింగ్, తాపీ పని, సెంట్రింగ్, ప్లంబింగ్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్లు, మార్బుల్స్ అతికేవారు, ఇటుక బట్టీల్లో పని చేసేవారు, కాంక్రీట్ మిల్లర్లు, భవన నిర్మాణ కార్మికులు ఇలా వీరందరూ నిర్మాణ రంగంపై ఆధారపడి బతుకుతున్నారు. వీరంతా రోజువారీ పనులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తుంటారు. తాపీ మేస్త్రీకి రూ.900 నుంచి రూ.వెయ్యి, పనిచేసే కార్మికులకు రూ.500 నుంచి రూ.600 వరకూ కూలి ఉంటుంది. నెలంతా పని చేస్తేనే వీరికి ఇల్లు గడుస్తోంది. ఇసుక సరఫరాను ప్రభుత్వం నిలిపివేయడంతో గడిచిన మూడు నెలలుగా నిర్మాణ రంగం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పనుల్లేక కార్మికులు రోడ్డున పడిన పరిస్థితి ఉంది. ఆదాయం లేకపోవడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబాలు అద్దె చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. బ్లాక్ మార్కెట్లో ఇసుక విక్రయాలు కొనసాగుతున్నా ధరలు చూస్తే గుండె గుభేలుమంటుంది. మూడు నెలల క్రితం వరకూ పది చక్రాల లారీ ఇసుక రూ.18 వేల నుంచి రూ.20 వేలు వరకూ ఉండేది. ఇప్పుడు రూ.30 వేల నుంచి రూ.32 వేల వరకూ ధర పలుకుతోంది. మొన్నటి వరకూ టన్ను ఇసుక రూ.వెయ్యి ఉండగా ప్రస్తుతం రూ.1500 వరకూ పలుకుతోంది. ట్రాక్టర్ ఇసుక రూ.1200 ఉండేది కాస్తా రూ.ఐదు వేలకు చేరింది. బ్లాక్‌మార్కెట్లో ఇసుక కొనుగోలు చేయాలంటే చుక్కలు కన్పిస్తున్నాయి. దీంతో నిర్మాణ రంగం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వైసిపి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఉచిత ఇసుక పాలసీని రద్దు చేసి కొత్త పాలసీ ప్రకటించడంలోనూ జాప్యం చేయడంతో భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులు నెలలు తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దఎత్తున ఉపాధి పొందే రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణ కార్మికుల పట్ల ప్రభుత్వం అత్యంత ఘోరంగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. లక్షల కుటుంబాలు ఉపాధి లేక అల్లాడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకుండా పోయింది. పిల్లలకు ఫీజులు కట్టలేక, ఇల్లు గడవక అప్పులు తెచ్చి కార్మికుల కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయి. ఇసుక సరఫరాలో ప్రభుత్వం ఆది నుంచి వివాదాస్పదంగానే వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. కొత్తగా ఉపాధి కల్పించకపోగా ఉన్న ఉపాధిని సైతం ప్రభుత్వం దెబ్బతీస్తుందనే చర్చ కార్మికుల్లో నడుస్తోంది. ప్రభుత్వం వెంటనే ఇసుక సరఫరాను వేగవంతం చేసి నిర్మాణరంగంలో పని చేసే కార్మికులను ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.



పంటలను రక్షించుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : తుఫాన్ నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు పాటించి పంటలను రక్షించుకోవాలని ఏవో బి.జ్యోతి తెలిపారు. మంగళవారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో మిరప, జొన్న పంటలను ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటలకు తెగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాన్ వల్ల పొలాల్లో నీళ్లు నిలవకుండా చూడాలన్నారు. ధాన్యం గట్టిపడి ఉంటే వెంటనే నూర్పిడి చేసుకుని సురక్షిత ప్రదేశంలో తడవకుండా భద్రపరచుకోవాలని సూచించారు. వ్యవసాయ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గని కార్మికులు జాగ్రత్తలు పాటించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : తుఫాన్ వర్షాల వల్ల కొలిమిగుండ్ల మండలంలోని నాపరాయి గని కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా గనులలో నీరు నిండి ఉంటుందని, తడి కారణంగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గనుల యాజమాన్యం నీటిని గమనించి తగిన సేఫ్టీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. తడిచిన విద్యుత్ స్థంబాలను, బోర్డులను, నాపరాయి కోత మిషన్లను నేరుగా ముట్టుకోరాదని సూచించారు.

సర్వ నరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : సిరివెళ్ల మండలంలోని నల్లమల అడవిలో వెలసిన సర్వ నరసింహస్వామిని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి మంగళవారం దర్శించుకున్నారు. భూదేవి, శ్రీదేవి సతీసమేతుడైన లక్ష్మీ నరసింహ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో నరసయ్య, ఆలయ కమిటీ వారు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఎమ్మెల్యే శ్రీదేవిని పట్టు శాలువతో సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేశారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - రుద్రవరం : గ్రామ పంచాయతీలో రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ మధుసూదనరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ పరిపాలన విధానంపై ఆయన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిపాలనలో భాగంగా ప్రధానంగా రికార్డులు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాలలో లేఔట్లు వేసే క్రమంలో ఏ నిబంధనలు పాటించాలి, ఆదాయ మార్గాలు, ఆడిట్ విధానం తదితర అంశాలపై కార్యదర్శులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి శ్రీనివాస శర్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : మండలంలోని బెలుం గ్రామంలో శ్రీకృష్ణ ఆలయంలో కార్తీక మాసం బహుళష్టమి సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు, పంచామృత అభిషేకాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. అనంతరం భక్తులకు నర్ల గొల్ల బాలుడు కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైవిఎస్ నారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

8 నుండి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

- జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8 నుండి చేపడుతున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఏసురత్నం, ఎ.నాగరాజు, వి.బాల వెంకట్‌లు కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్వాడీలకు కనీసం ఉద్యోగభద్రత లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని తెలిపారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి అమలు చెయ్యాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్స్ మార్చాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భీమా అమలు చెయ్యాలని, పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ప్రీ స్కూల్ బలోపేతం చెయ్యాలని తదితర డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు ఈ నెల 8 నుండి సమ్మెలో పాల్గొంటూ ర్యాలీలు, ధర్నాలు ఇతర సమ్మె పోరాట కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తప్పెట కళాకారులు

తప్పెట కళాకారులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : తప్పెట కళాశాలరులకు అండగా ఉంటానని, సమస్యల పరిష్కారానికి ఎప్పుడైనా తన ఇంటి తలుపు తట్టవచ్చని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిషోర్ రెడ్డి హామీనిచ్చారు. ఆది తప్పెటక కళాకారుల భవనానికి స్థలం కేటాయించిన సందర్భంగా మంగళవారం నంద్యాలలోని ప్రథమనందీశ్వరస్వామి దేవస్థానం లోని వైఎస్సార్ కళ్యాణ మండపంలో ఆది అరుందతీ తప్పెట కళాకారుల అభినందన కార్యక్రమం బాయికాటి ప్రహ్లద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పా, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ డా.నౌమాన్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డా.శశికళరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్పెట కళాకారులతో మనిషికి విడదీయలేని అనుభందం ఉందని, శుభమైనా, అశుభమైనా తప్పెట కళాకారులు లేనిది జరగదన్నారు. నాడు శిల్పామోహన్రెడ్డి తప్పెట కళాకారులకు తప్పెట్లు ఇచ్చారని గుర్తు చేశారు. భవిషత్తులో తప్పెట కళాకారుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆది అరుందతి తప్పెట కళాకారుల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలిసి పని చేద్దాం రండి..

- మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనంద రెడ్డిని కలిసిన మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల నియోజకవర్గంలో అందరం కలిసి సమిష్టిగా పార్టీ అభివృద్ధికి కృషి చేద్దామని మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనంద రెడ్డిని కోరినట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే భూమా నివాసానికి ఎన్ఎండి ఫరూక్ మంగళవారం వెళ్లి కలిశారు. భూమా బ్రహ్మనందరెడ్డితో దాదాపు 45 నిమిషాలు చర్చించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకువెళ్ళేందుకు కలిసి పని చేద్దామని భూమా బ్రహ్మనంద రెడ్డిని ఆహ్వానించినట్లు సమాచారం. అందుకు భూమా తన కార్యకర్తలతో, అభిమానులతో మాట్లాడి అభిప్రాయాన్ని తెలుపుతానని ఫరూక్‌కు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఎన్ఎండి ఫరూక్ భూమా బ్రహ్మనంద రెడ్డిని కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ అభివృద్ధికి కలిసి కృషి చేస్తారా...? లేక ఎవరి దారి వారే అన్నట్లుగా కార్యక్రమాలు నిర్వహిస్తారా అనేది వేచి చూడాల్సిందే...



భూమా బ్రహ్మనందరెడ్డిని కలిసిన ఎన్ఎండి ఫరూక్

వైసిపి పాలనలోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి

- ముస్లిం షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపి పాలనలోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమయిందని ముస్లిం షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వైసిపి ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ ఫైజ్, అత్తార్ జాహిద్ హుస్సేన్‌లు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో ముస్లిం మైనార్టీ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. టిడిపి పాలనలో ముస్లిం మైనార్టీలకు చేసింది ఏమీ లేదన్నారు. ముస్లిం మైనారిటీల మీద మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని గాని విమర్శించే అర్హత టిడిపి నాయకులకు లేదన్నారు. కాటసాని రామిరెడ్డి 2009లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఈద్గా అన్యాక్రాంతం కాకుండా ఆయన సొంత ఖర్చులు రూ. 25 లక్షలతో ప్రహరీ నిర్మించినట్లు తెలిపారు. 2019లో ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ముస్లింల శాశ్వత అభివృద్ధికి శ్రీకారం చుట్టారని చెప్పారు. రూ. 69 లక్షలతో ముస్లింల స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణాన్ని నిధులు మంజూరు చేయించారని, పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. పట్టణంలోని షియా మతస్తులకు తన సొంత ఖర్చులు రూ. 40 లక్షలతో ఇబాదత్ ఖానా నిర్మించారని చెప్పారు. త్వరలోనే ప్రారంభోత్సవం చేస్తారన్నారు. రవ్వలకొండ మీద మదర్సాకు ముస్లిం మైనారిటీ నాయకులు అడిగిన వెంటనే స్థలాన్ని కేటాయించారని తెలిపారు. కొండపేటలోని మర్కస్ మస్జిదుకు పార్కింగ్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారని చెప్పారు. పట్టణంలో ముస్లిం కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని రూ. 1 కోటి 20 లక్షలతో షాది ఖానాను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాటసాని రామిరెడ్డికి నియోజకవర్గ ముస్లిం మైనార్టీ కుటుంబాలు అండగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 2024 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డిని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. సమావేశంలో వైసిపి ముస్లిం మైనార్టీ నాయకులు సైకిల్ షాప్ మహబూబ్ వలి, ఆరాఫత్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

అధిక సాంద్ర పద్ధతిలో పత్తి సాగు లాభదాయకం

- నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సతీష్ కుమార్

ప్రజాశక్తి - బనగానపల్లె : అధిక సాంద్ర పద్ధతిలో పత్తి సాగు లాభదాయకమని నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సతీష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో యూనిట్ హెడ్, సీనియర్ శాస్త్రవేత్త జి.ధనలక్ష్మి అధ్యక్షతన ప్రపంచ నేలల దినోత్సవంలో భాగంగా అధిక సాంద్రత విధానంలో పత్తి సాగుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ విధానంలో పత్తి దిగుబడులపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. దేవనూరు గ్రామంలోని నాగేంద్ర రెడ్డి పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించి ఇంత బెట్ట పరిస్థితుల్లో సైతం ఎకరాకు 6 క్వింటాల దిగుబడి వచ్చిందని తెలిపారు. వాతావరణం అనుకూలిస్తే కనీసం ఎకరాకు 8 నుండి 13 క్వింటాల దిగుబడి వస్తుందన్నారు. అనంతరం సాయిల్ హెల్త్ కార్డ్సను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, రవి గౌడ్, లక్ష్మి ప్రియ, నందికొట్కూరు డివిజన్ లోని జలకనూరు, శాతనకోట గ్రామాల రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జె శోభారాణి

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- అంగన్వాడీ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - బేతంచర్ల

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జె శోభారాణి, సిఐటియు జిల్లా నాయకులు వై ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయం నందు అంగన్వాడి మండల కార్యదర్శి ఎన్ని నాగలక్ష్మి అధ్యక్షతన అంగన్వాడీల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలు గు దశాబ్దాల కాలంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చాలీచాలని వేతనాలతో అటు ప్రభుత్వానికి ఇటు సమాజానికి ఎన్నో సేవలు అందిస్తున్నారని, కానీ, పాలక ప్రభుత్వాలు అంగన్వాడీల పట్ల నిర్లక్ష్య ధోరణి వ్యవహరించడం దారుణం అన్నారు. అంగన్వాడీలను వివిధ రకాల యాప్‌ల ద్వారా పని భారం పెంచడమే కాకుండా, నెలకు ఒక వర్షన్ అమలు చేస్తూ పని ఒత్తిడి పెంచి మానసికంగా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక రూపాల్లో వినతులను సమర్పించుకున్న స్పందించకపోవడంతోనే ఈనెల 8వ తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్లడం జరుగుతుందన్నారు. కార్మిక సంఘాలు, అంగన్వాడి సేవలను అనుభవిస్తున్న లబ్ధిదారులు సహకరించి సంఘీభావాన్ని తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షురాలు గుల్జార్బి, రాజేశ్వరి, మేరీ, అనూష, జ్యోతి, రంగాపురం వరలక్ష్మి, జ్యోతి, వెంకటలక్ష్మి , అంజలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు దిక్సూచి పొలంబడి : ఎఓ

ప్రజాశక్తి - వెలుగోడు

రైతులకు దిక్సూచీగా డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిలుస్తుందని, రైతులంతా పొలంబడిలో చేరి మేలైన పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని ఏవో పవన్ కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం వెలుగోడు మండలంలోని మోత్కూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పవన్ కుమార్ మాట్లాడుతూ రైతులం తా క్రమం తప్పకుండా పొలంబడి కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయంలో నూతన సాంకేతికను అందిపుచ్చుకోవాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించాలన్నారు. పొలంబడి కార్యక్రమం ద్వారా వ్యవసాయ నిపుణుల ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పవన్ తో పాటు నంద్యాల జిల్లా పొలంబడి మానిటరింగ్ అధికారి కళ్యాణ్ కుమార్, ఏఈఓ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

భూ బదలాయింపు స్థలాన్ని పరిశీలించిన జెసి


మ్యాపును పరిశీలిస్తున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామంలో భూ బదలాయింపు పుకు నిర్ణయించిన స్థలాన్ని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. రాష్ట్రంలో అధిక వర్షాలు కురిసిన పుడు నీరు వృథాగా సముద్రంలో కలవకుండా రాయలసీమ జిల్లాలకు సాగు నీరు, తాగునీటికి వినియోగించుకునేందుకు పోతిరెడ్డిపాడు నుండి ఎస్ఆర్ఎంసి, ఎస్ఆర్బిసి, ఎస్కేపీ ఛానల్ కాలువల విస్తరణ పనులు ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా ఎస్ఆర్బిసి ఛానల్ కాలువ విస్తరణ పనుల్లో సాగర్ పవర్‌కు చెందిన వారి పొలం సర్వే నెంబరు 507, 509లలో 1.18 సెంట్లు కోల్పోయారు. ఆనాడు సాగర్ పవర్ వారికి వారి భూమికి బదులు మరోచోట అంతే భూమి ఇస్తామని చెప్పి కలెక్టర్ తెలిపారు. ఆ విషయంపై సాగర్ పవర్ వారు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఈ విషయంపై నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామం సమీపంలో ఉన్న సర్వే నంబర్ 414ఏ, 421 డి లలో 0.34 సెంట్లు బదలాయింపుకు గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. భూమి ఖరీదును అడిగి తెలుసుకొని, అనంతరం సాగర్ పవర్ వారు కోల్పోయిన పొలాన్ని జెసి పరిశీలించారు. బదలాయి ంపుకు సంబంధించిన ఫైల్ సిద్ధం చేయాలని తహశీల్దారును ఆదేశించారు. అనంతరం ఇరిగేషన్ అధికార లతో వాటర్ గ్రిడ్ క్రాస్ రెగ్యులేటర్ నుండి ఏయే కాల్వకు ఎంత నీటిని పంపిణీ, కాలువల సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు.

కొత్తపల్లిని పర్యాటకంగా అభివృద్ధికి కృషి : జెసి


పర్యాటక స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

కొత్తపల్లి : కొత్తపల్లి మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని కపిలేశ్వరం వద్ద ఏపీటూరిజం ఏర్పాటుకు స్థలం, ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రదేశాలను జెసి పరిశీలించారు. అదేవిధంగా సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించి, అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సంగమేశ్వరం వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఏపీ టూరిజంను ఏర్పాటు చేస్తుందని దానికోసం స్థల పరిశీలన చేశామన్నారు. పర్యాటకంగా ఈ ప్రదేశం ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. త్వరలో ఏపీ టూరిజం ఏర్పాటు ప్రభుత్వ కృషిచేస్తుందన్నారు. అదేవిధంగా తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నిర్మించబోతున్న 167-కె జాతీయ రహదారి ప్రదేశాలను. రెండు రాష్ట్రాల నడుమ నిరించబోతున్న ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రదేశాలను పరిశీలించామ న్నారు. అదేవిధంగా మార్గమధ్యలో ఎం.లింగాపురం గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీని తనిఖీ చేసి, ఎండియూ ఆపరేటర్ల ప్రజలకు అందుబాటులో ఉండాలని పలు సూచనలు చేశారు. ఆర్డీఓ దాసు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఆర్ఐ జహంగీర్ బాషా, సర్వేయర్ అనుష, వీఆర్వోలు మారాలి, రామసుబ్బయ్యతదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో దాసు, తాసిల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో గోపీకృష్ణ, ఈఈ మనోహర్రాజు, డిఈ హరినాథ బాబు, ఏఈఈ విశ్వనాథ్ పాల్గొన్నారు.

జెసికి సమస్యల వెల్లువ

ఎర్ర గూడూరు గ్రామానికి చెందిన వెంకట్రామయ్య ఎస్ఆర్ ఎంసిలో భూమిని కోల్పోయామని ఇంతవరకు పరిహారం రాలేదని పలుమార్లు అధికా రుల దృష్టికి తెచ్చిన స్పందించలేదని జాయింట్ కలెక్టర్ ముందు వాపోయారు. జెసి స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆర్డీవో, తాసిల్దార్‌లను ఆదేశించారు. మరో రైతు నేషనల్ హైవేలో 19 సెంట్లు పోయినట్లు చూపించి ఎక్కువ భూమిని తీసుకుంటున్నారని ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చిన స్పందించడం లేదని, కొలతలు వేసి 19 సెంట్లు తీసుకోవాలని జెసికి మొరపెట్టుకున్నారు. స్పందించిన జెసి ఆర్అండ్‌బి అధికారులు, రెవెన్యూ శాఖలు కలిసి కొలతలు వేసి రైతు ఎంత భూమి కోల్పోతున్నది చూపించాలని ఆదేశించారు. గ్రామానికి చెందిన దళిత మహిళలు గత కొన్ని సంవత్సరాలుగా కూలి పనిపైనే ఆధారపడి జీవిస్తున్నామని సెంటు భూమి కూడా తమకు లేదని ప్రభుత్వం నుండి భూమి పంచి మమ్మల్ని ఆదుకోవాలని జెసిని కోరారు. ఈ మండలంలో అసైన్మెంట్ ల్యాండ్ ఉందా అని తహశీల్దారును జెసి ఆరా తీయ గా.. ఎక్కడా లేదని చెప్పడంతో ప్రభుత్వ భూమి లేదని, దరఖాస్తు చేసు కోండి భవిష్యత్తులో ఏదైనా అవకాశం ఉంటే ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు.

పేదలకు మంచి జరగాలన్నదే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పేద ప్రజలకు మంచి జరగాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం శిరివెళ్ల మండలంలోని ఇసుకపల్లె, చెన్నూరు గ్రామాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్వరమే వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిన వారికి సంబంధిత కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తిరిగి తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి వసీం, జడ్పిటిసి నాయక్ జాఫర్, ముల్లా అన్వర్ భాష , హాజీ హబీబ్, చాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

ఏఈ నాగరాజుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-డోన్

సామాజిక సంఘ సంస్కర్త ఏఈ నాగరాజుకు ఘన సన్మానం చేసినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు వనం లక్ష్మీదేవి, నంద్యాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున స్వామిలు తెలిపారు. మంగళవారం డోన్ పట్టణంలోని స్థానిక ముక్తేశ్వరాలయంలో అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవ సందర్భంగా గత 30 సంవత్సరాల నుండి సామాజిక సేవకునిగా వినియోగదారుల హక్కుల పరిరక్షణపై వినియోగదారులను జాగృతి చేస్తూ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం నుండి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం నుండి అనేక అవార్డులు ప్రశంస పత్రాలు పొందిన నాగరాజును పూలమాలలతో శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్యోతిరావు పూలే చిత్రపటంను అందజేశారు. అనంతరం ప్రముఖ సామాజిక సేవకులు వెంకటేశ్వర్లు, రేకులకుంట మద్దయ్య, బేతంచర్ల రోటరీ క్లబ్ నాయకులు విశ్వ హిందూ పరిషత్ నాయకులు తదితరులు నాగరాజుకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఈ నాగరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతానని అదేవిధంగా వినియోగదారులు నష్టపోకుండా జాగృతి కార్యక్రమాలు చేపడతామన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ప్రభుత్వ రస్తాలను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం నాగేశ్వరావు అన్నారు. మంగళవారం నందికొట్కూరు ఎమ్మార్వో ఆఫీస్ నందు ఆర్డీవో దాసుకు ఎం నాగేశ్వరావు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీలో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ప్రభుత్వ రస్తలను, భూములను కబ్జా చేస్తున్నారని, శాంతి టాకీస్ నుండి మండ్లేం వరకు వెళ్లే బండి రస్తను నాగరంగం, తులసి రెడ్డి మరి కొంతమంది కబ్జా చేసి ప్లాట్ వేసి అమ్ముకు న్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వారు ప్లాట్లు వేసి పెద్ద ఎత్తున ప్రజలను మోసం చేసి అమ్ముకుంటున్నారని, నందికొట్కూరు చుట్టూ జరుగుతున్న రియల్ ఎస్టేట్ దోపిడిని అరికట్టి ప్రభుత్వ రస్తాలు, భూములు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఓబులేసు, కె.వెంకటేశ్వరులు, సజ్జనం, రామిరెడ్డి, దక్క కుమార్, ఏసన్న, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో దాసు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

పిల్లలందరూ బడుల్లోనే ఉండాలి

5వ పేజీ తరువాయి.. 60 మంది వాలంటీర్లు బృందంగా ఏర్పాటై దీర్ఘకాలికంగా బడులకు వెళ్ళని పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో నమోదు కాని పిల్లలను వెంటనే నమోదు చేయించి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయాలని డిఇఒను ఆదేశించారు. వాలంటీర్ల పనితీరుపై స్క్వాడ్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. 6 సచివాలయాలను జోనల్‌గా తీసుకొని సర్వేలో గుర్తించిన బడి ఈడు పిల్లలను ఖచ్చితంగా పాఠశాలల్లో ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రూరల్ మండలాలలో డ్రాపవుట్స్ లేరని, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు తదితర పట్టణ ప్రాంతాల్లో అదనంగా మరొక జిల్లా అధికారిని ఏర్పాటు చేసి డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని డిఇఒకు సూచించారు. జిఇఆర్ సర్వేపై విద్యార్థి సంఘాలతో సమావేశం నిర్వహించి డ్రాపవుట్స్ ఉన్న పిల్లలను గుర్తించి బడులకు పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించామని డిఇఒ కలెక్టర్‌కు నివేదించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్‌పిజి గ్రౌండ్ సమీపంలో ఉన్న ముగ్గురు పిల్లల వివరాలు అడిగి తెలుసుకుని, ఎందుకు బడి బయట ఉన్నారని ప్రశ్నిస్తూ తిరిగి పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. **మహానంది :** బడి బయట ఉన్న పిల్లలను, బడికి రాని పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్చించాలని తహశీల్దార్ జనార్దన్ శెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిమ్మాపురం గ్రామంలోని మోడల్ స్కూల్‌లో మండల స్థాయి అధికారులు, హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, వాలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ శివ నాగజ్యోతి, ఎంఇఒలు రామసుబ్బయ్య, లింగన్న, మోడల్ స్కూల్ హెచ్‌ఎం లక్ష్మణరావు, గాజులపల్లి హెచ్‌ఎం రవణమ్మ, వీఆర్వో వెంకటరాముడు, పంచాయతీ కార్యదర్శులు ఇర్ఫాన్, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ పాఠశాలలోనే ఉండాలని, అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని లేబర్ అధికారి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ రమేష్ బాబు, ఎంఇఒ శోభా వివేకవతి, శానిటరీ కార్యదర్శి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని తహశీల్దార్ రవీంద్ర ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే పై ఎంఈఓ లక్ష్మి ఆధ్వర్యంలో వాలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. **బేతంచర్ల :** బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని తహసిల్దార్ నరేంద్ర రెడ్డి అన్నారు. బేతంచర్ల పట్టణంలోని అమ్మవారి శాలలో మండల ఎంఈఓ జి.సోమశేఖర్ ఆధ్వర్యంలో విద్యాశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన తహశీల్దార్ నరేంద్ర రెడ్డి మాట్లాడారు. ఎంపీడీవో వెంకన్న, ఎంఈఓ-2 జనార్దన్ గౌడ్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు. **డోన్:** డ్రాప్ అవుట్‌లో ఉన్న విద్యార్థులు,లాంగ్ ఆబ్సెంట్లతో ఉన్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి కోరారు. డోన్ పట్టణంలోని పాత ముని సిపల్ కార్యాలయం నందు 3,4,5 సచివాలయాలకు సంబంధించిన కేవిఎస్ కాలనీ,పాతపేట, కొండపేట ప్రాంతాలలోని పిల్లలందరినీ పాఠశాలలో ఉంచే విధంగా చేయాలని వాలంటీర్లకు వర్క్ షాప్‌ను నిర్వహిం చారు. సిఆర్పీ వెంకటేశ్వరమ్మ, వెల్ఫేర్ అసిస్టెంటు పాల్గొ న్నారు. **కొత్తపల్లి :** డ్రాప్‌అవుట్ విద్యార్థులు లేకుండా చూసుకో వాలని ఎంపీడీఓ మేరి, ఎంఈఓ-1 శ్రీరాములు సూచిం చారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామవలం టీర్లకు, వెల్ఫేర్, అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎంఈఓ-ఇనాయతుల్లా పాల్గొన్నారు. **పాములపాడు :** విద్యార్థుల డ్రాప్‌అవుట్ రేటును తగ్గించే విధంగా గ్రామాలలో అవగాహన కల్పించాలని ఎంపీడీవో గోపికృష్ణ, ఎంఈఓ 2 సుభాషిని ఉద్యోగులకు, వాలంటీర్లకు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని వాలంటరీలతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

అభివృద్ధి చేసిన వారికే పట్టం కట్టండి : చైర్మన్



పథకాల గురించి వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్


మాట్లాడుతున్న జెడ్పిటిసి బోరెడ్డి శ్రీరామ్ రెడ్డి

ప్రజాశక్తి-డోన్

ప్రజలకు సంక్షేమ పథకాలతో అభివృద్ధి చేసిన వారికే మళ్లీ పట్టం కట్టా లని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రజలను కోరారు. మంగళవారం డోన్ పట్టణంలోని కొండపేట పరిధిలో 7వ సచివాలయంకు సంబంధించిన 10,11 వార్డులలో ' వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హాజరై మాట్లాడారు. ప్రజల వద్దకే అన్ని సంక్షేమ పథకాలను తీసుకుపోయిన ఘనత వైసిపికే చెందుతుం దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామి రెడ్డి, వైస్ చైర్మన్ లు హరికిషన్, జాకీర్ హుస్సేన్,కౌన్సిలర్ బుర్రు రమాదేవి,సచివాలయ కన్వీనర్ వేణు గోపాల్, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో వైసీపి జెండా ఎగరేస్తాం : జడ్పిటిసి

ప్యాపిలి : రాబోయే స్థానిక ఎన్నికలలో డోన్ నియోజవర్గంలో వైసీపీ జెండా ఎగరేస్తామని జడ్పీటీసీ శ్రీరామరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ పుల్లారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ బోరా మల్లికార్జునరెడ్డి,భువనేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్యాపిలి పట్టణంలోని 3వ సచివాలయ పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం ఈవో ఆర్‌డి బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకం బోర్డును ఆవిష్కరించి, వైసీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 27 కోట్లు రూపాయలు లబ్ధి చేకూర్చే విదంగా ప్రభుత్వ పాలన సాగిందన్నారు. సంక్షేమ పథకాలతో పేద వారు సంతోషంగా ఉన్నారని, వారంతా ముఖ్యమంత్రికి అండగా నిలబడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రాము,చిన్న రామాంజి,ప్రభాకర్ రెడ్డి,బోరెడ్డి రఘు,మస్తాన్,కొండయ్య, బషీర్, రాజా మురళి, జింకలఅంజి, పెద్ది రాజు,రంగన్న, శీను, వెంకటనారాయణ పాల్గొన్నారు.

పాతిక్రేయుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ట్రాక్టర్ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన బండి ఆత్మకూరు ఆంధ్రప్రభ విలేకరిగా పనిచేస్తున్న నాగరాజు భార్య మల్లేశ్వరి మరణించడంతో భర్త నాగరాజును శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి మంగళవారం పరామర్శించారు. భోధనం గ్రామంలో నాగరాజు ఇంటికి వెళ్లి పరామర్శించి ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చి, ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు దేరెడి చిన్న సంజీవరెడ్డి, మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేసు వెంకటరామిరెడ్డి, వైసిపి కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ ముడిమల పుల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమ్ సింహ నాయక్, సహకార సంఘం అధ్యక్షులు భూరం శివలింగం, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా పిఆర్‌టియు అధ్యక్షుడి ఎన్నిక

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల పట్టణంలోని స్థానిక పిఆర్టియు కార్యాలయంలో మండల అధ్యక్షుని ఎన్నికలు వ్యవస్థాపక అధ్యక్షులు వైవి. సుబ్బారెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి కే.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. పీఆర్టీయు అధ్యక్షునిగా సివి శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్ సభ్యునిగా వడ్ల శ్రీనివాసులు,అసోసియేట్ అధ్యక్షునిగా ధనుంజయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు సహోపాధ్యాయులు శుభాకాంక్షలు తెలపగా, మండల అధ్యక్షులు సివి శ్రీని వాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాడుతూ, పిఆర్‌టియు యూనియన్‌ను అగ్ర స్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. పిఆర్‌టియు మండల గౌరవ అధ్యక్షులు దానమయ్య, జిల్లా కౌన్సిలర్ నాగ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు వీరారెడ్డి సుధాకర్,తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-డోన్

కర్నూల్ నుండి డోన్‌కు డోన్ నుండి కర్నూలుకు పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించిన ముగ్గురు ప్రయాణికులకు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం శశిభూషణ్ మంగళవారం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 16 తేదీ నుండి 30 తేదీ వరకు డోన్ నుండి కర్నూల్‌కు పల్లె వెలుగు బస్సుల నందు ప్రయాణించిన ప్రయాణికులు బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్ నందు ప్రయాణికులు తమ టికెట్ వెనకాల వారి పేరు, ఫోన్ నెంబరు రాసి గిఫ్ట్ బాక్స్ నందు వేసిన వారికి మంగళవారం డ్రా తీయడం జరిగిందని గిఫ్ట్ బాక్స్ స్కీములో ఎంపికైన ముగ్గురు ప్రయాణికులు మొదటి బహుమతి కర్నూల్‌కు చెందిన పి.అల్లిపీరకు రెండవ బహుమతి కర్నూలుకు చెందిన పి.ప్రమోద్ కుమార్‌కు మూడవ బహుమతి వెల్దుర్తికి చెందిన యస్.శ్రీరామ శెట్టిలకు బస్టాండ్ నందు ప్రయా ణికుల సమక్షంలో బహుమతులు అందజేశారు. ఈ అవకాశాన్ని ప్రయా ణికులు ఉపయోగించుకోవాలని కోరారు.

వైఎస్ఆర్ బీమా పేదలకు వరం : కౌన్సిలర్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

వైఎస్ఆర్ బీమా పేదలకు వరమని 17 వార్డు కౌన్సిలర్ రౌవూఫ్ అన్నారు. పట్టణంలో 17వ వార్డ్ సాయిబాబాపేటలో నివాసముంటున్న ఈజీ చిన్నయ్య (48) అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం నాడు విషయం తెలుసుకున్న కౌన్సిలర్ రౌవూఫ్ కుటుంబ సభ్యులు నెహ్రూ నగర్ గ్రామంలో ఉన్నారని తెలుసుకొని బీమా పథకం తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రెటరీ మద్దిలేటి, వాలంటీర్ ఉష తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు, పాములపాడులను కరువు మండలాలుగా ప్రకటించాలి

- రైతు సంఘం డిమాండ్


తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు మా బాష, కార్యదర్శి వీరన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహ నాయక్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నాడు స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందర ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 సంవత్సరాల కిందట వచ్చిన విధంగా కరువు ఇప్పుడు వచ్చినా కరువు జాబితాలో ఆత్మకూరు మండలాన్ని ప్రభుత్వం చేర్చకపోవడం విచారకరం అన్నారు. కరువు మండలంగా ప్రకటించాలని పంటలను పరిశీలించి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు అయినా కళ్ళు తెరిచి ఆత్మకూరు మండ లాన్ని కరువు మండలంగా ప్రకటించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ మనోహర్‌కి మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ,సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఏ. రణధీర్,జి నాగేశ్వర రావు, ఏ. సురేంద్ర, ఆదినారా యణ, ఏ. కిరణ్ నాగేంద్ర, నాయక్, గణపతి, మహమ్మద్, సిఐటియు నాయ కులు శ్రీనివాసులు, రెడ్డి, కలిముల్లా, రజ్వి, నాగ పుల్లయ్య, ఉమ్మర్, ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు:** పాములపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తాసిల్దార్ పటాన్ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భ ంగా రైతు సంఘం మండల కార్యదర్శి టి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి సోమన్న మాట్లాడారు. పాములపాడు మండలంలో ఖరీఫ్ సీజన్లో సరైన పంట ఎదుగుదల సమయంలో వర్షాలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని కరువు మండలంగా ప్రకటిం చాలని, ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం అంది ంచాల ని కోరారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 20వేల రూపాయలు అందించి తక్షణమే వారికి పనులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాల యేసు, ప్రతాపు, బ్రహ్మయ్య, రంగస్వామి, వ్యకాసం నాయకులు ఎస్ఆర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : బిసి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, చేతగాని విధానాలతో మిచౌంగ్ తుఫాన్ ముందస్తు చర్యలు తీసుకోలేని అసమర్థ సిఎం జగన్ రెడ్డి వల్ల రైతాంగం తీవ్ర కష్టాలు అనుభవిస్తోందని బగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి భవిష్యత్తు గ్యారెంటి పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదలు, తుఫాన్‌లు, కరువు పరిస్థితులు తలెత్తినా రైతులను ఆదుకోవాలనే కనీస స్పృహ కూడా వైసిపి నాయకులకు లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పి టిడిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఐవి పక్కిరా రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ఎం రామేశ్వర్ రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, కోటపాడు శివారెడ్డి, కెపి వెంకటేశ్వర్లు, కల్లూరి సూరి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **బనగానపల్లె :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ పంచమపేటలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించి భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, పట్టణ అధ్యక్షుడు ఖాసింబాబు, 2వ వార్డ్ మెంబర్ లాయర్ నాగేంద్రరెడ్డి, నాయకులు టిప్‌టాప్ కలాం, అల్తాఫ్ హుస్సేన్, ఖాదర్ భాష, షబ్బీర్, రమణ, ఇస్మాయిల్ ఖాన్, యనకండ్ల బాల తిమ్మారెడ్డి , మీరాపురం నాగిరెడ్డి, హమ్మద్ హుస్సేన్, మహిళలు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరా



మాట్లాడుతున్న ఎంపిడిఒ గోపికృష్ణ

ఆర్థిక వనరుల సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామ పంచాయతీల పరిపాలన, ఆర్థిక వనరుల సేకరణపై పంచా యతీ కార్యదర్శులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ, ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడులు పరిపాలన, ఆర్థిక వనరుల సేకరణపై శిక్షణ ఇచ్చారు. గ్రామాలలో గ్రామపంచాయతీకి ఇంటి పన్నులు కులాయి పనులు నిధులను సేకరించుకొని పరిపాలన ఖర్చులకు సమకూర్చుకోవా లన్నారు. అంతేకాక కొన్ని మేజర్ గ్రామపంచాయతీలలో లేఅవుట్లు తదితర ఆర్థిక సమకూర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగార్జున రెడ్డి, పుల్లయ్య, తిప్పన, శివలింగం, యశోదమ్మ, కృష్ణప్రియ, ప్రభాకర్, కాజా, ప్రవీణ్, కళ్యాణ్, ప్రేమ్ కుమార్, జిలాని పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించి పంటలను రక్షించుకోండి : ఎఓ

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామాల్లో రైతులు తుఫాను ప్రభావం ఉండడంతో జాగ్రత్తలు పాటించి పంటలను రక్షించు కోవాలని ఏవో రంగనేతాజీ తెలియజేశారు. మండ లంలోని డి.వనిపెంట గ్రామంలో నేలవాలిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు లకు పంటల రక్షణపై అవగాహన కల్పించారు. ధా న్యం గట్టిపడి ఉంటే వెంటనే నూర్పిడి చేసుకుని తడ వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.